క్లుప్తంగా

పశు పోషణలో జాగ్రత్త



పశువులకు వైద్య పరీక్ష చేస్తున్న వైద్యులు

యాచారం: పశువులు రోగాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారులు రేఖ, శేఖర్‌లు రైతులకు సూచించారు. వాటికి సకాలంలో వైద్యం అందిస్తే పాల ఉత్పత్తి బాగా పెరుగుతుందని పేర్కొన్నారు. బుధవారం మండల పరిధి నస్దికసింగారం గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 14 మంది రైతులకు చెందిన 57 పాడి, పశువులకు వైద్య చికిత్స అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది బుచ్చిరెడ్డి, వెంకటయ్య, వసంత తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



నూతన కార్యవర్గ సభ్యులు

కడ్తాల్: జిల్లా హమాలీ వర్కర్స్ ఫెడరేషన్, సీఐటీయూకి అనుబంధంగా.. హమాలీ వర్కర్స్ యూనియన్ మండల కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వంపుగూడెం రమేశ్, ప్రధాన కార్యదర్శిగా జిల్లెల పెంటయ్య, కోశాధికారిగా తుప్పరి వెంకటేశ్, సహాయ కార్యదర్శులుగా కేశని వెంకటేశ్, జంగయ్య, ఉపాధ్యక్షులుగా కాసమోని కృష్ణయ్య, పార్వతి జనార్దన్, పట్నం కృష్ణయ్య, జంగయ్య, సలహాదారులుగా రమేశ్, మల్లేశ్, పెంటయ్య, శ్రీను, కృష్ణయ్యలను నియమించారు. కార్యక్రమంలో సీఐటీయూ ఏరియా కమిటీ కన్వీనర్ పెంటయ్య ఉన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్

తుర్కయంజాల్: పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని కౌన్సిలర్ అనురాధ అన్నారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆమె బుధవారం పారిశుద్ధ్య కార్మికులు, మున్సిపల్ సిబ్బందికి నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ వార్డును అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న ఎంపీడీఓ మాధురి

ఆమనగల్లు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఎంపీడీఓ మాధురి బుధవారం స్థలం పరిశీలించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శిథిలావస్థలో ఉన్న నివాస గృహాన్ని కూల్చివేసి, అక్కడ ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మించనున్నట్లు ఆమె తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



ట్రంక్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

తుర్కయంజాల్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ పనిచేస్తుందని కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఐలయ్య అన్నారు. బుధవారం ఆయన పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని 22వ వార్డు సాయి ప్రియనగర్‌లో రూ.కోటి అంచనా వ్యయంతో చేపడుతున్న మురుగునీటి ట్రంక్‌లైన్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ఈ లైన్ నిర్మాణంతో సమస్యకు ముగింపు పలికినట్లేనని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ భిక్షపతి, నాయకులు మోహన్ నాయక్, రాగ్యా నాయక్, రాజు నాయక్, వెంకటేశ్ యాదవ్‌తో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వే సందడి షురూ

ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల తదితర వివరాలు సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సందడి బుధవారం ప్రారంభమయింది. ఇందులో భాగంగా తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ప్రత్యేక అధికారులు సర్వే సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఇళ్ల జాబితా, ఇంటింటికీ స్టిక్కర్లు, ప్రశ్నావళి తదితర అంశాలపై ఎన్యుమరేటర్లు, జీపీకార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. ఇంటింటికీ స్టిక్కర్లు అతికించే పనులు పరిశీలించారు.

- జాబితాలు సిద్ధం.. ఇంటింటికీ స్టిక్కర్లు పంపిణీ
- అధికారుల సన్నాహక సమీక్షలు
- ఎన్యుమరేటర్లు, జీపీకార్యదర్శులకు సలహాలు, సూచనలు
- నివాసాల సర్వే పరిశీలన



కడ్తాల్: సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఆమనగల్లు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి ఆదిలక్ష్మి అన్నారు. బుధవారం పట్టణంలోని రైతువేదిక భవనంలో సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మున్సిపాలిటీలో నిర్వహించిన ఇళ్ల సర్వేను కమిషనర్ వసంత, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్యలు పరిశీలించారు. మండల పరిధి రాంనుంతలలో ప్రత్యేకాధికారి ఆదిలక్ష్మి, తహసీల్దార్ లలిత, వ్యవసాయాధికారి శ్రీనివాస్‌గౌడ్, చింతలపల్లి గ్రామంలో ఎంపీడీఓ కుసుమ మాధురిలు పరిశీలించారు. ఇందులో భాగంగా తొలిరోజు ఎన్యుమరేటర్లు సర్వే ప్రారంభించారు.

ప్రజలు సహకరించాలి

కడ్తాల్: సమగ్ర కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల ప్రత్యేకాధికారి రామేశ్వరి దేవి, తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీఓ సుజాత అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వే సమావేశం ప్రజలు, నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడారు. ఇళ్ల జాబితాను సిద్ధం చేశామని, 8వ తేదీ లోపు ఇంటింటికీ స్టిక్కర్లు అతికిస్తామని పేర్కొన్నారు. 9 నుంచి 56 ప్రశ్నలతో పాటు,19 అనుబంధ ప్రశ్నలతో కలిపి మొత్తం75 ప్రశ్నలతో ఇంటింటి సర్వే చేయనున్నట్లు వెల్లడించారు. మండలంలో 88 మంది ఎన్యుమరేటర్లను నియమించామని, సర్వేకు వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని, అడిగిన సమాచారం ఇవ్వాలని, కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, రేషన్‌కార్డు, ఓటర్ ఐడీ తదితర ధ్రువ పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాలకు బాసటగా నిలిచేందుకు, కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ ఆలోచన మేరకు ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, సింగిల్‌విండో డైరెక్టర్లు డాక్టర్ శ్రీను, వెంకటేశ్, పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, నాయకులు లక్పతినాయక్, జహంగీర్‌బాబా, నర్సింహ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టిక్కర్ల పంపిణీ

యాచారం: సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా గ్రామాల్లో ఇళ్ల జాబితా నమోదు ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. గునుగల్, గడ్డమల్లయ్యగూడలో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, మాల్‌లో మండల పంచాయతీ అధికారి శ్రీలత ఇంటింటికీ వెళ్లి, స్టిక్కర్లు అతికించారు. కులగణనకు ప్రజలు సహకరించాలని ప్రజలకు సూచించారు.

పకడ్బందీగా చేపడతాం

తలకొండపల్లి: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపడతామని తహసీల్దార్ నాగార్జున అన్నారు. మండల పరిధి రాంపూర్, వెల్జాల్, చంద్రధన గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఇళ్లకు స్టిక్కర్లు అతికించే కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలో 12,257 ఇళ్లకు గాను, ఇప్పటి వరకు 6,245 నివాసాలకు స్టిక్కర్లు అతికించామని పేర్కొన్నారు. మరో మూడు రోజుల్లో మిగతా 6012 స్టిక్కర్లు అతికించి, సమగ్ర సమాచారం సేకరిస్తామని వెల్లడించారు. 54 కాలములను పూర్తి చేయాల్సి ఉంటుందని ఎన్యుమరేటర్లకు సూచించారు.



తలకొండపల్లి: ఇంటికి స్టిక్కర్ వేస్తున్న సిబ్బంది చిత్రంలో తహసీల్దార్ నాగార్జున

మాడ్గులలో..

మాడ్గుల: సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని మండల ప్రత్యేక అధికారి నర్సిరెడ్డి అన్నారు. సర్వేలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్ల జాబితాను సిద్ధం చేశామని, స్టిక్కర్లు అతికించామని పేర్కొన్నారు. అనంతరం ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఎంపీడీఓ పద్మావతి, ఎంఈఓ సర్దార్ నాయక్, ఉపాధ్యాయులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



యాచారం: గడ్డమల్లయ్యగూడలో స్టిక్కర్లు అతికిస్తున్న ఎన్యుమరేటర్ చిత్రంలో ఎంపీడీఓ



మాడ్గుల: ఇళ్ల జాబితా తయారీలో నిమగ్నమైన అధికారులు



ఆమనగల్లు: ఇళ్లను పరిశీలిస్తున్న కమిషనర్ వసంత

ఎమ్మెల్యే సహకారంతో గ్రామాభివృద్ధి

యాచారం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో మాల్ గ్రామం అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఎమ్మెల్యే సహకారంతో మంజూరైన 28 ఎల్‌ఈడీ వీధిలైట్లను బుధవారం గ్రామంలోని స్తంభాలకు బిగించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శేఖర్‌గౌడ్, మురళీ, బాల్‌రాజ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రం ఏర్పాటే లక్ష్యం

జేఏసీ నాయకులు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించేంత వరకు ఉద్యమం ఆగదని, దీక్షలు విరమించేది లేదని జేఏసీ కన్వీనర్ మొక్కురాల అశోక్ గౌడ్ అన్నారు. మండలం ఏర్పాటు చేయాలంటూ గట్టుఇప్పలిపల్లిలో చేపట్టిన దీక్ష బుధవారానికి 6వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మండలం ఏర్పాటుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, వనరులు గ్రామంలో ఉన్నాయని పేర్కొన్నారు. సుదీర్ఘకాలంగా ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించి ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ శరత్ చంద్ర, ఇస్లావత్ రాజు, రమేష్, రాములు, మల్లయ్య, జంగయ్య, శివ, రామిరెడ్డి, మాణిక్యం రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణను కలిసిన చైర్‌పర్సన్

తుక్కుగూడ: మున్సిపాలిటీలో జరిగిన మాదిగల ధర్మ యుద్ధ మహాసభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరయ్యారు. ఈ నేపథ్యంలో మంద కృష్ణ మాదిగను తుక్కుగూడ పుర చైర్‌పర్సన్ బరిగేల హేమలత బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజమోని రాజు తదితరులు పాల్గొన్నారు.

కులగణన దేశానికే ఆదర్శం

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్



స్టిక్కర్ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్: అసమానతలు, వివక్ష, పేదరికాన్ని రూపుమాపడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శమని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా బుధవారం మండల పరిధి మైసిగండిలో అధికారులతో కలిసి, ఇంటింటికీ స్టిక్కర్ అతికించే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సమగ్ర కుటుంబ సర్వేను ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. ఈ నిర్ణయం దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కులగణన ఎవరూ చేపట్టలేదని, రాహుల్ ఇచ్చిన మాట ప్రకారం సర్వేకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ప్రస్తుత సర్వేతో ఎస్సీ,ఎస్టీ,బీసీలతో పాటు, ఓసీలోని పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జంగయ్య, నాయకులు జవహర్‌లాల్, హీరాసింగ్, స్టాలిన్ కిషన్, తులసీరాం, శంకర్, తులసీరాం, చిన్న, భీమా, గోపి, రమేశ్ పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ సిస్టం మాయం

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్‌లో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టం విద్యుత్ స్తంభాలు కనిపించకుండా పోయాయని, ఎలాగైనా వాటి ఆచూకీ కనుగొనాలని మున్సిపల్ కమిషనర్ సరస్వతికి బుధవారం బీజేవైఎం కార్పొరేషన్ అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణపతి ఉత్సవాల సందర్భంగా మెయిన్ రోడ్డుపై ఉన్న సెంట్రల్ లైటింగ్ సిస్టం విద్యుత్ స్తంభాలు తీసివేశారని, పండుగ పూర్తయిన వెంటనే తిరిగి ఆయా స్థానాల్లో వాటిని ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ.. ఇప్పటికి వాటి ఊసేలేదన్నారు. సెంట్రల్ లైటింగ్ సిస్టం సంబంధింత కాంట్రాక్టర్ అమ్మేసుకున్నాడని ఆరోపించారు. వీటితో పాటు శివనారాయణపురం కాలనీలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ విద్యుత్ స్తంభాలను కూడా మాయం చేశారన్నారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పచ్చదనంపై గొడ్డలి వేటు

అభివృద్ధి పేరిట చెట్ల నరికివేత



రోడ్డు పక్కన కలప

మంచాల: మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని ఓ వైపు ప్రభుత్వం ఏటా రూ.కోట్లు ఖర్చు పెడుతుండగా.. మరోవైపు అభివృద్ధి పేరిట కొందరు ఏపుగా పెరిగిన చెట్లను మొదళ్లకు నరికి వేస్తున్నారు. మంచాల మండలంలో రహదారుల నిర్మాణం, విద్యుత్ తీగలకు చెట్లు, కొమ్మలు అడ్డుగా ఉన్నాయంటూ సంబంధిత సిబ్బంది, కాంట్రాక్టర్లు వృక్షాలను నేల కూలుస్తున్నారు. ఇదే అదునుగా కొందరు కలపను విక్రయించి, సొమ్ముచేసుకుంటున్నట్లు సమాచారం. చెట్లను కూలదోయడమే కాకుండా.. వాటి స్థానంలో మరలా మొక్కలు నాటాలని ప్రజలు కోరుతున్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ఆమనగల్లు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించనున్నామని పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ నెల 8న పట్టణంలోని ఓ గార్డెన్‌లో చేపట్టనున్నామని పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు రాములు, జిల్లా నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదానం శిబిరం పోస్టర్లను పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. సీఎం పుట్టిన రోజును పురస్కరించుకుని రక్తదానం శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, నాయకులు ఖలీల్, ఖాదర్, వస్పుల శ్రీశైలం, కృష్ణనాయక్, అలీం, రాజశేఖర్, వస్పుల శ్రీకాంత్, ఫరీద్, మల్లయ్య, మహేశ్, నాజర్, హరిలాల్, చంద్రు, రహీం, రఘు, గౌస్, శివ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

టాలెంట్ టెస్ట్ వాల్‌పోస్టర్..

కందుకూరు: టీఎస్‌యూటీఎఫ్ జన విజ్ఞాన వేదిక సంయుక్తంగా నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం కందుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు అంజయ్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని ఇలాంటి టాలెంట్ పరీక్షల ద్వారా వెలికితీయ వచ్చునని పేర్కొన్నారు. ఇలాంటి టెస్టులు నిర్వహించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు జగన్నాథ్‌శర్మ, కల్పన, ఎడ్ల కల్లేశ్, కె.రవి, జె.బుగ్గరాములు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

కందుకూరు: విద్యార్థులు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సీఐ సీతారామ్ సూచించారు. బుధవారం మండలంలోని గూడూరు గేట్ వద్ద ఉన్న ఎస్సీ గురుకులంలో ఆయన విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాలతో జీవితం కోల్పోవాల్సి వస్తుందన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థినులు తమ పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే 100 నంబర్‌కు డయల్ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

దారిపొడవునా కంకరే..



బుగ్గతండా లింకురోడ్డు దుస్థితి



ఆనవాళ్లు కోల్పోయిన ఎల్లమ్మతండా రోడ్డు

ప్రమాదకరంగా లింకురోడ్లు

- కయ్యలు, గుంతలు.. ముందుకు సాగని వాహనాలు
- ప్రయాణ కష్టాలు ఎదుర్కొంటున్న గ్రామీణ ప్రాంత ప్రజలు
- రెండు దశాబ్దాలుగా పట్టించుకోని అధికారులు, పాలకులు

మంచాల: గ్రామీణ ప్రాంతాల లింకురోడ్లు అధ్వానంగా మారాయి. గోతులు, కయ్యలు ఏర్పడి పూర్తిగా ఆనవాళ్లు కోల్పోయాయి. వాహనాల రాకపోకలు కాదు కదా.. కనీసం కాలి నడకన వెళ్లలేని దుస్థితి నెలకొంది. దీంతో పల్లె ప్రాంత ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు. మంచాల మండలం ఆరుట్ల నుంచి ఎల్లమ్మతండా అటు లోయపల్లి, ఇటు రంగాపూర్ దాద్‌పల్లి గ్రామాలకు చేరుకోవడానికి అనువైన లింకురోడ్డు బుగ్గతండా- ఎల్లమ్మతండా క్రాస్‌రోడ్డు. అదే విధంగా ఆగాపల్లి నుంచి నోముల మీదుగా మంచాల, లింగంపల్లి, ఆరుట్ల గ్రామాలకు చేరుకోవడానికి ఆగాపల్లి- నోముల లింకురోడ్డు, జాపాల నుంచి గడ్డమల్లయ్య గూడం మీదుగా గునగల్, యాచారం చేరుకోవడానికి జాపాల- గున్‌గల్ లింకురోడ్డు ఎంతో అనువైనది. ఇలా ఈ మూడు అనుబంధ రహదారులు పూర్తిగా కంకతేలి, రవాణాకు అసౌకర్యంగా మారాయని ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు.

మట్టి, కంకర పోసి..

రెండు దశాబ్దాల క్రితం లింకు రోడ్ల మరమ్మతుల్లో భాగంగా కంకర పోసి రోడ్లను విస్తరించారు. మట్టి, కంకర పోసి చదునుచేసి వదిలేశారు. క్రమంగా రోడ్లు పూర్తిగా రూపం కోల్పోయి, ప్రజారవాణాకు అసౌకర్యంగా మారాయి. గోతులు ఏర్పడి.. ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వర్షాలకు పలుచోట్ల రోడ్లు కోతలకు గురయ్యాయి. కయ్యలు ఏర్పడ్డాయి. అధ్వాన లింకురోడ్లకు మరమ్మతు, లేదా పునర్నిర్మించాలని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు.

మరమ్మతు చేపట్టండి



మండల కేంద్రాల నుంచి గ్రామీణ ప్రాంతాలను కలిపే లింకు రోడ్లు గిరిజనతండాలకు ఎంతో ఉపయోగం. అలాంటి రోడ్లు అధ్వానంగా మారినా.. అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. వెంటనే బుగ్గతండా- ఎల్లమ్మతండా క్రాస్‌రోడ్డును మరమ్మతు చేయించి, ప్రజా రవాణాను మెరుగు పర్చాలి.

– అంగోత్ ప్రవీణ్ కుమార్, లోయపల్లి

నిధులు విడుదల కాగానే..



ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే లింకురోడ్లకు మరమ్మతు చేయిస్తాం. ఆగాపల్లి- నోముల, బుగ్గతండా- ఎల్లమ్మతండా ఎక్స్‌రోడ్డు, జాపాల- గున్‌గల్ లింకు రోడ్ల దుస్థితి మా దృష్టికి వచ్చింది. నిధులు రాగానే.. రోడ్లను మరమ్మతు చేయిస్తాం. ప్రజారవాణాను మెరుగు పరుస్తాం.

–ఎం.డీ. అబ్బాస్(డీఈఈ)పంచాయతీ రాజ్ శాఖ

కోనో కార్పస్ చెట్లను తొలగించండి

తహసీల్దార్ ముంతాజ్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే కోనో కార్పస్ మొక్కలను వెంటనే తొలగించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. జాతీయ రహదారి డివైడర్‌తో పాటు, అన్మాస్‌పల్లి, తలకొండపల్లి రహదారికి ఇరువైపులా, గ్రామాల్లోని పల్లెప్రకృతి వనాల్లో నాటిన కోనో కార్పస్ మొక్కలను తొలగించాలన్నారు. ఆ చెట్ల వలన పర్యావరణ కాలుష్యంతో పాటు.. ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారని పేర్కొన్నారు. బుధవారం స్థానిక నాయకులతో కలిసి తహసీల్దార్ ముంతాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోనో కార్పస్ చెట్ల అనేక దుష్ప్రభావాలకు దారితీస్తుందని శాస్త్రవేత్తలు, వృక్ష పర్యావరణ నిపుణులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. పర్యావరణానికి విఘాతం కలుగుతుందని శాస్త్రవేత్తలు గుర్తించారన్నారు. ఆ చెట్ల కాయల నుంచి వెలువడే పుప్పొడి ద్వారా ఆస్తమా, అలర్జీ, శ్వాసకోస వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని పరిశోధనల్లో తేలిందన్నారు. విషయం తెలిసిన ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, వెంటనే ఆ చెట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. వాటి స్థానంలో పర్యావరణ సమతుల్యాన్ని కాపాడే మొక్కలను పెంచాలని కోరారు. నాయకులు నరేశ్‌నాయక్, లక్పతినాయక్, యాదయ్య, రాజేందర్‌గౌడ్, పురుషోత్తం ఉన్నారు.

షాద్‌నగర్ డీఐగా వెంకటేశ్వర్లు

షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్ ఠాణా డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్(డీఐ)గా సంద వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు ఇక్కడ డీఐగా పనిచేసిన పీడీ.నాయుడు మేడ్చల్ జోన్ సీసీఎస్ విభాగానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లును ఏసీపీ రంగస్వామి, పట్టణ సీఐ విజయకుమార్ అభినందించారు.